క్లుప్తంగా

కమిటీలదే తుది నిర్ణయం

అశ్వారావుపేట: అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులను గ్రామ సహాయక సంఘాల కమిటీలు నిర్ణయం మేరకే నిర్వహించాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పాఠశాలల హెచ్ఎంలు, వీఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 41 ప్రభుత్వ పాఠశాలలో రూ. 1.27లక్షలతో మౌళిక వసతులు ఆధునీకరించనున్నట్లు పేర్కొన్నారు. పాఠశాల హెచ్ఎం కన్వీనర్‌గా, గ్రామ సమాయక సంఘం సభ్యులు చైర్మన్‌గా, డ్వాక్రా మహిళలు, తల్లులు ఈకమిటీలో సభ్యులుగా ఉంటారని.. కమిటీ ఆమోదంతో చైర్మన్ సూచించిన వారే కన్వీనర్ పర్యవేక్షణలో నిర్వహించాలని సూచించారు. తరగతి గదులు, మరుగుదొడ్లు, విద్యుత్‌సౌకర్యాల కల్పనకు ఈ నిధులు వినియోగించాలని అన్నారు. ఎంఈఓ పి.కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఐబీ ఏఈఈ కృష్ణ, ఎంపీఓ సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి కల్యాణం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత బాలాజీ వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని శనివారం వైభవంగా జరిపించారు.స్వా మి వారికి ఉదయం పంచామృత అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు.

అదనపు కలెక్టర్ పూజలు..

మండల కేంద్రంలోని బాలాజీ వేంకటేశ్వర స్వామి, భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయాలను జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ బాధ్యులు అదనపు కలెక్టర్‌కు స్వామి వార్ల తీర్థ ప్రసాదాలను అందించారు.

మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

అన్నపురెడ్డిపల్లి: ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేయాలని, అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన రూ.500 బోనస్‌ను చెల్లించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకుడు ఎస్‌కె.ఉమర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కట్టుగూడెం, ఎర్రగుంట గ్రామాల్లోని కల్లాల్లో ధాన్యాన్ని ఆయన ఆ సంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. వ్యాపారులు తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు వ్యాపారులు కొనుగోలు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు కారం వెంకటేశ్వర్లు, నాయకులు తిరుపతయ్య, బాబు, జానీపాషా, మైబు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు చేయండి

చర్ల: గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయిని కులం పేరుతో దూషించి అవమాన పరచిన గిరిజనేతరుడిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని గన్నవరంకాలనీలో పూనెం శోభన్ బాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలానికి చెందిన ఒక గిరిజనేతర బడా వ్యాపారి జీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయిని కులం పేరుతో దూషించాడని పేర్కొన్నారు. నాయకులు అర్సా అరవింద్, పాయం వేణు, కల్లూరి వీరన్న, బోడిక శ్రీకాంత్, బోడిక శరత్, పర్శిక మహేందర్, పాయం ప్రశాంత్, పాయల నగేందర్ పాల్గొన్నారు.

హక్కుల సాధనకు కృషి

మణుగూరురూరల్: ఏఐటీయూసీ బలోపేతానికి కృషి చేస్తూ.. కార్మికులు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.అయోధ్య పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక నిరుద్యోగులకు మణుగూరులోని ఓబీ కంపెనీలలో ఉపాధి కల్పించడంలో సింగరేణి యాజమాన్యం విఫలం చెందిందన్నారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు, కోశాధికారి సీతారాములు, సీపీఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, అదెర్ల సురేందర్, రాము, అవినాష్, ప్రసాద్, సంపత్, అన్వర్, సంతోష్ పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డే

మణుగూరురూరల్: మున్సిపాలిటీలోని పైలట్ కాలనీ ప్రాంతంలో ఉన్న ఎక్సలెంట్ హైస్కూల్‌లో శనివారం గ్రాడ్యుయేషన్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మణుగూరు సీఐ సతీష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై నర్సరీ నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. ఎక్సలెంట్ విద్యాసంస్థల చైర్మన్ ఎండి.యూసఫ్ షరీఫ్, కరస్పాండెంట్ ఎండి.ఖాదర్, డైరెక్టర్ యాకుబ్ షరీఫ్, ప్రైమరీ ప్రిన్సిపల్ సమియా నయ్యర్, ఉపాధ్యాయులు జీనత్ పాల్గొన్నారు.

కస్తూర్బాలో నైపుణ్యాలపై నజర్

- ఆత్మ రక్షణకు కరాటే తరగతులు
- టైలరింగ్‌పై సంపూర్ణ శిక్షణ
- ఆసక్తి కనబరుస్తున్న విద్యార్థినులు


టైలరింగ్‌పై విద్యార్థినులకు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు


కరాటే శిక్షణ..


అల్లికల్లో విద్యార్థినులు

సండే స్పెషల్

అన్నపురెడ్డిపల్లి: బాలికలకు విద్యనందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కస్తూర్బా గాంధీ విద్యాలయాలను నెలకొల్పాయి. ఈ విద్యాలయాలు బాలికలకు చదువుతో పాటు, వసతి కల్పిస్తున్నాయి. కస్తూర్బా విద్యాలయాల్లో ముఖ్యంగా అనాథలు, సింగిల్ పేరెంట్ ఉన్న బాలికలకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి ప్రవేశాలు కల్పిస్తారు. ఇక్కడ ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు నాణ్యమైన విద్యనందిస్తున్నారు. విద్యతో పాటు బాలికలకు ఆత్మ రక్షణ కోసం కరాటే తరగతులను, వృత్తి నైపుణ్యంలో కూడా శిక్షణ ఇస్తున్నారు. వృత్తివిద్యా నైపుణ్యంలో భాగంగా టైలరింగ్‌పై శిక్షణనూ ఇస్తున్నారు.

వృత్తి నైపుణ్యానికి టైలరింగ్..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్నపురెడ్డిపల్లి కస్తూర్బాగాంధీ విద్యాలయంలో జాతీయనైపుణ్యాభివృద్ధి (నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) సంస్థ వారు వృత్తి విద్యాశిక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 80 పాఠశాలలను ఎంపిక చేశారు. వృత్తి విద్యాశిక్షణలో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల వృత్తి నైపుణ్యాలపై శిక్షణ ఇస్తారు. దీనిలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 14 కేజీబీవీలు ఉండగా అన్నపురెడ్డిపల్లిలోని కేజీబీవీని ఈ శిక్షణకు ఎంపిక చేశారు. శిక్షణను విద్యాలయంలో జనవరి నెల నుంచి ప్రారంభించారు. టైలరింగ్‌లో విద్యార్థినులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకంగా వృతి నైపుణ్యంలో శిక్షణ పొందిన టీచర్‌ను నియమించారు. ప్రతిరోజు తరగతిలో ఒక పిరియడ్‌లో టైలరింగ్‌పై క్లాస్ నిర్వహిస్తున్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థినులకు టైలరింగ్‌పై తరగతులను బోధించడం జరుగుతోంది.అనంతరం పదోవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు టైలరింగ్‌పై పరీక్షలు నిర్వహించి, సర్టిఫికేట్‌ను అందజేస్తారు. చదువు పూర్తైన తర్వాత విద్యార్థులు ఈ శిక్షణ ద్వారా తమకాళ్లపై తాము నిలబడటమే కాక స్వయం ఉపాధిని పొందేందుకు ఇది ఉపయోగపడుతుంది.

కరాటేతో ఆత్మరక్షణ..

టైలరింగ్‌తో పాటు విద్యాలయంలో విద్యార్థులకు ఆత్మ రక్షణ కోసం ప్రత్యేకంగా కరాటే కూడా నేర్పిస్తున్నారు. సంవత్సరంలో మూడు నెలల పాటు విద్యార్థులకు కరాటే తరగతులు నిర్వహిస్తారు. విద్యార్థుల ఆత్మ రక్షణకు కరాటే ఎంతోగానో ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు టైలరింగ్‌లో శిక్షణ.. చెబుతున్నారు. నాణ్యమైన చదువుతో పాటు ఆత్మరక్షణ కోసం కరాటే, చదువు అనంతరం స్వయం ఉపాధి పొందేందుకు టైలరింగ్‌ను స్కూల్ స్థాయిలో నేర్పిస్తూ కస్తూర్బా గాంధీ విద్యాలయం ప్రత్యేకంగా నిలుస్తోంది.

శిక్షణ పొందడం సంతోషకరం



విద్యాలయంలోనే టైలరింగ్‌పై శిక్షణ ఇవ్వడం సంతోషంగా ఉంది. రెగ్యూలర్‌గా క్లాస్‌లో బోధించడం వల్ల ఆసక్తిగా ఉంది. పేపర్‌కట్టింగ్, క్లాత్ కట్టింగ్ శిక్షణ పొందుతున్నాం. ఈ వోకేషనల్ కోర్స్ మునుముందు ఉపయోగపడుతుంది.

– నాగచైతన్య, 9వ తరగతి

ఒక పీరియడ్‌గా టైలరింగ్



రెగ్యూలర్ క్లాస్ మాదిరిగా ఒక పీరియడ్‌లో టైలరింగ్ శిక్షణకు క్లాస్‌ను కేటాయించాం. ప్రస్తుతం థియరీ విధానంలో టైలరింగ్‌పై శిక్షణ ఇస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి పూర్తిగా మిషన్‌పైనే శిక్షణ ఇస్తారు. విద్యార్థినులు ఆసక్తి చూపిస్తున్నారు.

– కవిత, ఎస్ఓ, కస్తూర్బా విద్యాలయం

ఉపాధి పొందవచ్చు..



విద్యార్థులు టైలరింగ్‌లో శిక్షణ పొందిన అనంతరం పరీక్షలు నిర్వహించి సర్టిఫికేట్ అందజేస్తాం. దీంతో చదువు తర్వాత స్వయం ఉపాధి పొందవచ్చు. టైలరింగ్‌లో మరో ప్రత్యేకంగా శిక్షణ తీసుకోవాల్సిన అవసరం ఉండదు.

– అన్నామణి, జీసీడీఓ

పోలింగ్ కేంద్రాల పరిశీలన

చండ్రుగొండ: మండలంలోని పోలింగ్ కేంద్రాలను జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి శనివారం పరిశీలించారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఓటర్లకు సదుపాయాల కల్పనను ఆయన పరిశీలించారు. కేంద్రాల పరిసరాలను పరిశీలించారు. పోలింగ్ ఆటంకం కలిగించే శక్తులపై దృష్టిపెట్టాలని ఈ సందర్భంగా ఎస్సై మాచినేని రవికి సూచించారు. కేంద్రాల చుట్టుపక్కల ఉండే ఇళ్ల యజమానులకు ముందస్తు నోటీసులు ఇవ్వాలని ఎస్సైతో చెప్పారు.


పోకలగూడెం పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

పని వేళలు మార్చాలని వినతి


ఎస్ఓటూ జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మణుగూరుటౌన్: ఎండలు మండుతున్న నేపథ్యంలో సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరి పని వేళలను మార్చాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో ఏరియా ఎస్ఓటూ జీఎం శ్యామ్‌సుందర్‌కు శనివారం కాంట్రాక్ట్ కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ జిల్లా నాయకులు ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికుల పని వేళలను మార్చడంతో పాటు ఓఆర్ఎస్, మజ్జిగ పంపిణీ చేయాలన్నారు. అలాగే ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల నియామకంలో నిర్వాసితులకు, ఉపాధి కోల్పోయిన వార్డ్ బాయ్‌లకు, ఉపాధిలో అర్హత పొందిన నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. కరోనాతో మరణించి కేసీహెచ్‌పీ కాంట్రాక్ట్ కార్మికుడు పి.మధుసూధన్ కుటుంబానికి బీమా, ఎక్స్‌గ్రేషియా చెల్లింపుపై చర్యలు చేపట్టి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు గురుమూర్తి, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, శివరామకృష్ణ, సత్యవతి, రమణ, నాగమణి, రమాదేవి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు వసతులు కల్పించాలి



దమ్మపేట: గండుగులపల్లిలో ఉపాధి హామీ కూలీలతో కార్మిక సంఘం నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి రాములు

దమ్మపేట: వేసవిలో ప్రస్తుతం ఉన్న అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా, ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ప్రత్యేక వసతులను కల్పించాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని గండుగులపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను ఆయన కలిశారు. వారితో ఆయన మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పనులు జరుగుతున్న ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేసి, వడదెబ్బ తగలకుండా తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణాలను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

చండ్రుగొండ: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పని ప్రదేశాల్లో కూలీలకు సదుపాయాలు కల్పించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎస్‌కె.ఉమర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రం చండ్రుగొండలోని వెంకట్రామ్‌కుంటలో పనులు చేస్తున్న కూలీలతో శనివారం ఆయన సమావేశమైయ్యారు. సమావేశ సందర్భంగా మాట్లాడుతూ.. రోజు కనీస కూలీ రూ. 500లు ఇవ్వాలని, వైద్యం సదుపాయం, నీడ టెంట్లు వేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు చనిపోతే రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకుడు వరికూటి వెంకట్రావ్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కూలి రూ.600 ఇవ్వాలి

మణుగూరురూరల్: ఉపాధి హామీ కూలీలకు రోజువారీ కూలి రూ.600 ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి కొడిశాల రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలకు కనీస వేతన చట్టం అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు. గ్రామాల్లో ప్రతీ పేదవాడికి ఉపాధి హామీ పని ఇచ్చి కనీస వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం నాయకులు దామల్ల లెనిన్‌బాబు, సత్రపల్లి సాంబశివరావు, గుర్రం నరసయ్య, ఏడూళ్ళ రాములు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి యోగా శిక్షణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలోని వెంకటేశ్వర ఆలయం వద్ద భద్రాద్రి యోగ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ తరుగతులు ప్రారంభిస్తున్నట్లు నరేష్ గురూజీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సాధారణ శిక్షణ తరగతులు ఆదివారం నుంచి మే 20 వరకు, బరువు తగ్గడం, చిన్నారులకు శిక్షణ తదితర తరగతులు ఈ నెల 25 నుంచి మే 16 వరకు కొనసాగుతాయని అన్నారు. అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వాటర్ ఫ్రిజ్ వితరణ

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఉపాధ్యాయురాలు గద్దె మంజూశ్రీ వాటర్ మినీఫ్రిజ్‌ను వితరణగా శనివారం అందించారు. కొన్నేళ్లుగా ఆమె ఇదే పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఈ నెల 30న, పదవీ విరమణ చేస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం వజీద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదేళ్లుగా పనిచేస్తూ ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్న ఉపాధ్యాయురాలు గద్దె మంజూశ్రీని శనివారం ఘనంగా సన్మానించారు. పాఠశాలలో విద్యార్థుల చదువుపై ఆమె వృత్తిధర్మాన్ని నెరవేర్చిన తీరుతెన్నులను వక్తలు కొనియాడారు. ఎంఈఓ సత్తెనపల్లి సత్యనారాయణ, హెచ్ఎం వాజీద్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఆరీఫ్‌హుసేన్, సంజీవరావు, కృష్ణకుమారి, జిల్లా సైన్స్ అధికారి చలపతిరావు, హెచ్ఎం ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

కంటి వైద్య పరీక్షలు

మణుగూరురూరల్: మండలంలోని లంకమల్లారం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 382మంది విద్యార్థినులకు డాక్టర్ గోపిలాల్, నేత్రవైద్యాధికారి డాక్టర్ జి.సంజీవరావులు కంటి వైద్యపరీక్షలు చేశారు. వీరిలో 31 మందికి కళ్లజోళ్లు అవసరమని నిర్ధారించడంతో పాటు ఇద్దరిని ఇతర వైద్యపరీక్షల నిమిత్తం రిఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు. ప్రిన్సిపల్ పద్మావతి, స్టాఫ్‌నర్స్ సంపూర్ణ, ఆర్‌బీఎస్‌కే వైద్యసిబ్బంది సరస్వతి, పుష్ప, విద్యార్థినులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై చర్యలు

అశ్వాపురం: మండలంలో ఎలాంటి అనుమతులూ లేకుండా గోదావరి రేవుల నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో చింతిర్యాల, ఆమెర్దలో గోదావరి నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారన్న సమాచారంతో రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ చేస్తున్నామన్నారు. ఇసుక అక్రమ రవాణాపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

పర్ణశాలలో ఘనంగా తెప్పోత్సవం


గోదావరిలో తెప్పోత్సవ కార్యక్రమం..

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం గోదావరి నదిలో ఘనంగా తెప్పోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించిన అనంతరం స్వామి వారిని ఊరేగింపుగా గోదావరి నదీ దగ్గరకు తీసుకునివచ్చారు. ఆపై పడవపై తెప్పోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అలయ అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, రామభద్రచార్యులు, సీతారామచార్యులు, వెంకటాచార్యులు, ఆలయ ఉత్సవాల ప్రత్యేకాధికారి అనిల్‌కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుల ఆర్థిక సాయం

చర్ల: మండలంలోని లింగాపురంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులైన బాధిత కుటుంబానికి లింగాపురం యూత్ అండగా నిలుస్తోంది. శనివారం గ్రామంలోని యూత్ బాధిత కుటుంబ యజమాని మేడబత్తిని చిననర్సింహారావుకు రూ.32 వేల నగదుతో పాటు, బియ్యం, నిత్యావసర వస్తువులు, వంట సామగ్రి అందజేశారు. ఈ కార్యాక్రమంలో యూత్ సభ్యులు ఎడెళ్ల గణపతి, మేడబత్తిని వాసు, తడికల నరేష్, కొంగూరి సత్యనారాయణ, సరియం రాధ, రావుల కిషోర్, చల్లా నవీన్, కొంబత్తిని రాము, సిద్ధి రాజశేఖర్, వందే త్రీమూర్తులు, కొంగూరు రాజా, తడికల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: ములకలపల్లికి చెందిన కేతేపల్లి నాగరత్నంకు సద్గురు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగదును వితరణగా అందజేశారు. నాగరత్నం గత కొన్నేళ్లుగా స్థానిక భక్త అభయాంజనేయ స్వామి ఆలయంలో సేవలందిస్తున్నారు. ఈ క్రమంలో శ్రీరామనవమి సందర్భంగా నాగరత్నంను సన్మానించి, గ్రామస్తులు సేకరించిన నగదు అందజేసిన విషయం తెలిసిందే. కాగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ గాజర్ల వీరభద్రం గురూజీ పంపిన రూ.2 వేల నగదును సీనియర్ పాత్రికేయులు ఆయితా శేషగిరిరావు చేతులమీదుగా నాగరత్నంకు అందజేశారు. మిరియాల అవినాశ్, పసుపులేటి నర్సింహారావు, కుంచమఠం పుష్పావతి, గణపతి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేల పర్యటన

దుమ్ముగూడెం: మండలంలోని పలు గ్రామాల్లో మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపు కోరుతూ డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య శనివారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. ఈ దేశానికి శ్రీరామరక్ష అయిన ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, హక్కులు నిలబడాలంటే గాంధీ కుటుంబమే ఈ దేశానికి అండ అన్నారు. బీజేపీ మతోన్మాద విధానాలు ఈ దేశానికి ఎంతో ప్రమాదం అని, భారత సంపదను కార్పొరేట్లకు దారాదత్తం విమర్శించారు. మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం కే లక్ష్మీపురం గ్రామంలో ఏర్పాటు చేసినటువంటి ముత్యాలమ్మ తల్లి దేవాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం హత్యకు గురైన కన్నాయిగూడెం ఎంపీటీసీ బాలకృష్ణ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వీరమాచినేని వినిల్,టిసిసి సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్, నాయకులు చింతిరాల రవి కుమార్, పూజారి సూర్యచంద్రరావు, కనుబుద్ధి దేవా,శిరపు అప్పల రెడ్డి, నటరాజు స్వామి, డింగి సందీప్ రెడ్డి, వేమన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దుమ్ముగూడెం: నాయికులు, కార్యకర్తలతో పొదెం వీరయ్య

దమ్మపేట: మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శనివారం మండలంలోని దురదపాడు గ్రామంలో నిర్వహిస్తున్న అంకమ్మతల్లి తిరునాళ్ల ఉత్సవాలకు హాజరై, అమ్మవారిని దర్శించుకున్నారు. నాచారం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న చీకటి పుల్లయ్యను పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలి

కరకగూడెం: వలస ఆదివాసీలు ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని కరకగూడెం ఎస్సై రాజేందర్ అన్నారు. శనివారం మండలంలోని వలస ఆదివాసీ గ్రామమైన నిమ్మగూడెంలో ఆయన పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడుతూ.. గ్రామంలోకి ఎవరైనా కొత్తవారు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అపరిచిత వ్యక్తులకు గ్రామంలో ఆశ్రయం కల్పించవద్దని తెలియజేశారు. అనంతరం ఎన్నికల కోడ్ నేపథ్యంలో పలు చోట్ల వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్షన్ ఎత్తివేయాలని వినతి

ములకలపల్లి: ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరప్రసాద్‌పై విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలి కోరుతూ ఎంపీటీసీలు శనివారం ఎంపీడీఓ భారతి, ఎంపీఓ లక్ష్మయ్యలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఏఈ వరప్రసాద్ ఆర్‌డబ్ల్యూఎస్ విధులతోపాటు, మూడు జీపీలకు ప్రత్యేకాధికారిగా, ఎన్నికల సెక్టోరియల్ ఆఫీసర్‌గా శ్రీరామనవమి ప్రత్యేక డ్యూటీలు నిర్వహిస్తుంచామని అన్నారు. విధులు పక్కాగా నిర్వహించే ఏఈ వరప్రసాద్‌ను అధికారులు సస్పెండ్ చేసిన విషయంలో పునరాలోచించాలని కోరారు. ఏఈ వరప్రసాద్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని అభ్యర్థించారు. వినతిపత్రం అందజేసిన వారిలో వైస్‌ఎంపీపీ కొదుమూరి పుల్లారావు, కో-ఆప్షన్ సభ్యుడు ఎస్‌కె.జబ్బార్, ఎంపీటీసీ నూపా సరోజిని ఉన్నారు.

హామీలు అమలు చేయాలి

మణుగూరురూరల్: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు డిమాండ్ చేశారు. శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని, 24గంటల కరెంట్ అందిస్తామని, రైతు బంధు కింద రైతులకు రూ.15వేలు, కౌలు రైతులకు రూ.12వేలు, వరి ధాన్యానికి బోనస్ రూ.500 ఇస్తామని హామీ ఇచ్చి.. నేటి వరకు అమలు చేయలేదన్నారు. హామీలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు పోస్ట్‌కార్డ్ ఉద్యమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి రైతూ డిమాండ్లతో కూడిన పోస్ట్‌కార్డును సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ సెక్రటేరియట్-హైద్రాబాద్‌కు పంపాలని సూచించారు.

ఎన్నికల ప్రచారం

అశ్వారావుపేట: ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకుడు పల్లపోతుల వాసు శనివారం అశ్వారావుపేట శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ నెల 28న జరుగనున్న ఆర్యవైశ్య సంఘం జిల్లా ఎన్నికల్లో తనకు ఓటేయాలని అభ్యర్థించారు. ఆర్యవైశ్యులను అన్నిరంగాల్లో ముందుకు తీసుకువెళ్లి అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ అధ్యక్షుడు జల్లిపల్లి శ్రీరామమూర్తి, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు శీమకుర్తి శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు జల్లిపల్లి గుప్త, కొణిజర్ల ఉమామహేశ్వరరావు, జల్లిపల్లి దేవరాజు, కంచర్ల రామారావు, ముత్తా సుమాకర్ తదితరులు పాల్గొన్నారు.

పంటలకు నష్టపరిహారం చెల్లించాలి


కాలిపోయిన మొక్కజొన్న చేనును పరిశీలిస్తున్న నాయకులు

గుండాల: ప్రమాదవశాత్తు మొక్కజొన్న చేన్లకు నిప్పంటుకుని పూర్తిగా కాలిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని ఎంపీపీ ముక్తి సత్యం, జెడ్పీటీసీ వాగబోయిన రామక్కలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పోతిరెడ్డిగూడెంలో పలువురి రైతులకు చెందిన మొక్కజొన్న చేన్లు కాలిపోయిన సంఘటన విధితమే. కాగా శనివారం ఎంపీపీ, జెడ్పీటీసీతో పాటు, విద్యుత్ శాఖ ఏడీఏ కోటేశ్వరావు, ఏఈ రమేష్, వ్యవసాయ శాఖ ఏవోలు కాలిపోయిన మొక్కజొన్న చేన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్డీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముక్తి సత్యం, రామక్కలు మాట్లాడారు. సుమారు 25 ఎకరాల వరకు పంట దగ్ధమైనట్లు తెలిపారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం స్పందించి ఎకరాకు రూ.లక్ష చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ సర్పంచ్ కోరం సీతారాములు, వై.వెంకన్న, పెంటన్న, ఈసం కృష్ణ, లాలు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి..

అగ్ని ప్రమాదంతో మొక్కజొన్న పంటను కోల్పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు ఈసం శంకర్, కొమరం శాంతయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్, ఏఓలకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోతిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన రైతులు ఆరుగాలం శ్రమంచి పండించిన మొక్కొజొన్న పంట కాలిపోవడం దురదృష్టకరమని అన్నారు. ఎకరాకు రూ.80 వేలు నష్టపరిహారం చెల్లించాలనని కోరారు. నాయకులు అజయ్, శ్రావన్, రమేష్, ప్రభాకర్, లక్ష్మీనారాయణ, మోహన్‌రావు, పగడయ్య పాల్గొన్నారు.